క్లుప్తంగా

7న చెస్, బాల్ బ్యాడ్మింటన్ పోటీలు

వైవీయూ: కడప నగరంలోని ఎస్కేఆర్ అండ్ ఎస్కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జనవరి 7వ తేదీన వైవీయూ అంతర్ కళాశాలల క్రీడాపోటీల్లో భాగంగా చదరంగం, బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా తెలిపారు. ఈ పోటీల్లో వైవీయూ పరిధిలోని అనుబంధ కళాశాలల క్రీడాకారులు పాల్గొననున్నట్లు తెలిపారు. క్రీడాపోటీల్లో పాల్గొనే క్రీడాకారులు సంబంధిత వ్యక్తిగత క్రీడాసామగ్రిని వెంట తెచ్చుకోవాలని సూచించారు.

నిరుద్యోగ యువతకు శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు బెంగుళూరులో కంప్యూటర్, ట్యాలీ కోర్సుల్లో ఉచిత శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందని ఫౌండేషన్ అడ్మిషన్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 28 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి టెన్త్ పాస్, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ పాస్/ఫెయిల్ అభ్యర్థులు అర్హులన్నారు. 35 రోజులపాటు శిక్షణ ఉంటుందన్నారు. అనంతరం ప్రతిభను బట్టి ఉపాధి అవకాశాన్ని కల్పిస్తామన్నారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఇతర వివరాలకు 90004 87423 నెంబరులో సంప్రదించాలన్నారు.

29న సాహిత్య సదస్సు

కడప కల్చరల్ : సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఆదివారం ఉదయం 10 గంటలకు సాహిత్య సదస్సు నిర్వహించనున్నట్లు బ్రౌన్ కేంద్రం సంచాలకులు ఆచార్య పార్వతి తెలిపారు. 139వ నెలనెల సీమ సాహిత్యం సదస్సులో భాగంగా తిరుపతికి చెందిన శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ప్రాచ్య పరిశోధన సంస్థ సహాయాంధ్ర పరిశోధకులు డాక్టర్ తొండాటి రాజశేఖర్, డాక్టర్ మౌని జీవితం–సాహిత్యం అనే అంశంపై ప్రసంగించనున్నట్లు తెలిపారు.

దుస్తులు పంపిణీ



చిన్నారులకు దుస్తులు అందజేస్తున్న జ్యోతిష్య నిపుణులు సురేష్‌బాబు

కడప కల్చరల్ : కడప నగర శివార్లలోని తోళ్ల గంగన్నపల్లె వద్దగల మెర్సీ కరుణామయ ఆశ్రమంలో చిన్నారులకు దుస్తుల పంపిణీ నిర్వహించారు. ప్రముఖ జ్యోతిష్య నిపుణులు ఎం.సురేష్‌బాబు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆయన కేక్ కట్ చేసి బాలలకు అందజేశారు. అలాగే వారికి నూతన వస్త్రాలు, స్కూలు బ్యాగులు, బెడ్‌షీట్లు పంపిణీ చేశారు. ఆ తర్వాత కార్యక్రమానికి హాజరైన వారికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఫాదర్లు విజయరావు, చంద్ర, సుధాకర్, జనార్దన్, సవారియ, మరియ, నరసింహా, రెడ్డికుమార్, మున్నా, స్తోత్రరాజ్, జాన్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

8, 9 తేదీల్లో కవి సమ్మేళనం

కడప కల్చరల్ : వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 8, 9 తేదీల్లో శతాధిక కవి సమ్మేళనం నిర్వహిస్తున్నామని సంస్థ అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి తెలిపారు. నగరంలోని ఐఎంఏ హాలులో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. రాయలసీమ ఔన్నత్యాన్ని చాటే విధంగా భాష, సంస్కృతి, చరిత్ర, సాహిత్యం అనే అంశాలలో నేటి సామాజిక పరిస్థితులకు అనుగుణంగా ప్రగతిశీల అభ్యుదయ భావాలతో కూడిన కవిత్వాన్ని ఆహ్వానిస్తున్నామన్నారు. ఆటవెలది, తేటగీతి పద్యాలైతే ఐదు పంపాలని, వృత్త పద్యాలైతే మూడు చాలునని, కవితలు 20 లైన్లకు మించి ఉండకూడదన్నారు. జనవరి 15లోగా కవితలు జింకా సుబ్రమణ్యం (97046 51414), డాక్టర్ తవ్వా వెంకటయ్య (970391 2727)లకు పంపాలని సూచించారు. కవులందరూ సమ్మేళనంలో పాల్గొని కవితాగానం చేయాల్సి ఉంటుందన్నారు. మొదటి మూడు బహుమతులు పొందిన కవితలకు రూ. 3000, 2000, 1000 బహుమతులు అందిస్తామన్నారు.

డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి తదితరులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ) రాష్ట్ర కమిటీ విడుదల చేసిన నూతన సంవత్సర ఎగ్జిక్యూటివ్ డైరీని గురువారం జిల్లా ప్రజారవాణ అధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి ఇతర అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులందరికీ ఉపయోగపడేలా పూర్తి సమాచారం డైరీని రూపొందించడంపై ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రాము, విల్సన్, మోహన్ రాజు, విష్ణువర్ధన్‌రెడ్డి, సురేష్ కుమార్, హుస్సేన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



కల్యాణమూర్తులుగా స్వామి, అమ్మవార్లు



కల్యాణోత్సవానికి హాజరైన గోవిందమాల దీక్ష ధారులు, భక్తులు

కడప కల్చరల్ : 'ఒళ్లంతా కళ్లు చేసుకున్నా ఆ వైభవాన్ని తనివితీరా చూడలేము. ఆ కమనీయ దృశ్యాన్ని తిలకించిన జీవితమే ధన్యము. ఇదిగిదిగో కళ్లెదుటే వైకుంఠము' అంటూ భక్తులు పరవశించారు. విశాలమైన పందిట్లో మనోహరంగా అలంకరించిన వేదికపై నిర్వహించిన శ్రీ శ్రీనివాసుడి కల్యాణ ఘట్టాన్ని చూసేందుకు గోవిందమాల దీక్ష ధారులైన భక్తులు బంధుమిత్రులు, కుటుంబ సభ్యుల సమేతంగా తరలివచ్చారు. కల్యాణాన్ని తన్మయత్వంతో భక్తిపూర్వకంగా తిలకించారు. గురువారం కడప నగరం మున్సిపల్ మైదానంలో శ్రీ గోవిందమాల భక్తబృంద సేవా సమితి ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇందులో భాగంగా ఉదయం 5 గంటలకు సుప్రభాతసేవ, అనంతరం తోమాల సేవ, అర్చనలు నిర్వహించారు. 9 గంటల నుంచి కల్యాణోత్సవం ప్రారంభమైంది.

హృదయోల్లాసం..

కల్యాణ ఘట్టంలో భాగంగా కుడివైపున నూతన వరుడిగా శ్రీవారిని, ఎడమవైపు ఉభయదేవేరులైన శ్రీదేవి, భూదేవి మాతలను వధువులుగా అలంకరించి కొలువుదీర్చారు. వేద పండితులు ఉదయగిరి అనంత నారాయణాచార్యుల బృందం కల్యాణ క్రతువును క్రమంగా నిర్వహించింది. పుణ్యాహవాచనం, కలశ ప్రతిష్ఠ, గణపతిపూజ, ప్రవరలు, యజ్ఞోపవీత ధారణల అనంతరం సంప్రదాయంగా కన్యాదానం చేశారు. మహామంగళ సూత్రాలను భక్తులందరికీ దర్శింపజేశారు. అనంతరం మంగళ వాయిద్యాల సుస్వరాలు, వేదమంత్రోచ్చాటనల మధ్య స్వామి పక్షాన వేద పండితులు అమ్మవార్ల గళసీమల్లో మంగళ సూత్రాలను అలంకరించారు. ఈ సందర్భంగా వేద పండితుల బృందాలు తలంబ్రాల కార్యక్రమాన్ని ఉత్సాహ భరితంగా నిర్వహించారు. భక్తులందరికీ మంగళాక్షతలను కల్యాణ ప్రసాదంగా అందజేశారు.

ప్రారంభం నుంచి కార్యక్రమం ముగిసేంత వరకు టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు అన్నమయ్య కీర్తనలు ఆలపించారు. భక్తులు అడుగడుగునా చేసిన గోవిందనామ స్మరణలు ఆ ప్రాంగణంలో ప్రతిధ్వనించాయి. హాజరైన వారందరికీ వివాహ భోజనం ఏర్పాటు చేశారు. కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి దంపతులు, నగర మేయర్ సురేష్‌బాబు, మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాష, ఇతర నేతలు కల్యాణోత్సవానికి హాజరై పూజల్లో పాల్గొన్నారు. నిర్వాహకులు వారిచే పూజలు నిర్వహింపజేసి వేదాశీస్సులు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం ఉత్సవ మూర్తులను గరుడ వాహనంపై కొలువుదీర్చి ప్రత్యేకంగా అలంకరించిన రథంపై కడప నగరంలోని పలు ముఖ్య కూడళ్లలో సందడిగా గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయం నుంచి సన్నటి జల్లులు అప్పుడప్పుడూ కురిసినా భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు.



కల్యాణోత్సవానికి విచ్చేసిన మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



కల్యాణోత్సవంలో రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

కడప కార్పొరేషన్: మున్సిపల్ మైదానంలో నిర్వహించిన శ్రీదేవి, భూదేవి, శ్రీ వేంకటేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవంలో రాజంపేట ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా రాజీనామా చేయాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఓబుల్‌రెడ్డి

కడప సెవెన్‌రోడ్స్ : బీఆర్ అంబేడ్కర్‌పై రాజ్యసభలో అవమానకరమైన వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తక్షణమే రాజీనామా చేయాలని కోరుతూ ఈనెల 30న దేశవ్యాప్త పిలుపులో భాగంగా కడపలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ డాక్టర్ సి.ఓబుల్‌రెడ్డి, కో కన్వీనర్లు బి.లక్ష్మీరాజా, రిటైర్డ్ డీఈ గుర్రప్ప పిలుపునిచ్చారు. గురువారం కడప నగరంలోని ఇంజనీర్స్ భవనంలో గుర్రప్ప అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షా వ్యాఖ్యలపై దేశ వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తినా ప్రధాని నరేంద్రమోదీ ఇంత వరకు దిద్దుబాటు చర్యలు చేపట్టకపోవడం దారుణమన్నారు. ఈ పరిస్థితుల్లో నిరసనలు కొనసాగించాలని ప్రజా సంఘాలు నిర్ణయించాయని పేర్కొన్నారు. రౌండ్ టేబుల్ సమావేశంలో జమిలి ఎన్నికలపై కూడా చర్చించారు. జమిలి ఎన్నికలు ప్రజాస్వామ్యం పై దాడి చేయడమేనని అభిప్రాయపడ్డారు. ఇందుకోసం రాజ్యాంగ సవరణ బిల్లుతో సహా మరో రెండు బిల్లులు కేంద్రం పార్లమెంటులో ప్రవేశపెట్టిందన్నారు. వీటిని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఐక్యవేదిక నాయకులు డాక్టర్ రాజా వెంగళరెడ్డి, సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు గాలి చంద్ర, చంద్రశేఖర్, వివిధ ప్రజా సంఘాల నాయకులు రఘునాథరెడ్డి, రవిశంకర్, లెనిన్ ప్రసాద్, రామాంజనేయులు, దస్తగిరిరెడ్డి, గంగా సురేష్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

– కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా



కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు


కడప కార్పొరేషన్: మున్సిపల్ కార్మికులు గత ప్రభుత్వంలో కుదుర్చుకున్న ఒప్పందాలను వెంటనే అమలు చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట మున్సిపల్ ఇంజనీరింగ్ సెక్షన్ కార్మికులు ధర్నా నిర్వహించారు. మున్సిపల్ డ్రైవర్స్ కమిటీ సుంకర కిరణ్, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, మున్సిపల్ యూనియన్ నగర అధ్యక్షులు సుంకర రవి మాట్లాడుతూ... ఇంజనీరింగ్ కార్మికుల జీతాల పెంపు, సంక్షేమ పథకాలు, పర్మినెంట్ కార్మికులకు సరండర్ లీవ్‌లు, జి.పి.ఎఫ్ అకౌంట్లు తదితర డిమాండ్ల పరిష్కారానికి 2024 జనవరి 24వ తేదీన నాటి ప్రభుత్వం ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌కు సిఫార్సు చేసిందన్నారు. కాగా ఆ తరువాత సాధారణ ఎన్నికలు రావడంతో ఈ ఫైళ్ల వ్యవహారం మూలన పడిందన్నారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం వచ్చీ రాగానే ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌లో ఉన్న మున్సిపల్ కార్మికుల ఫైళ్లన్నింటిని తెప్పించుకొని 5 నెలలు గడిచినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నగర అధ్యక్షులు చంద్రారెడ్డి, మున్సిపల్ యూనియన్ జిల్లా కార్యదర్శి విజయభాస్కర్, జిల్లా ఉపాధ్యక్షులు కంచిపడి తిరుపాల్ , కోశాధికారి గోపి, మున్సిపల్ యూనియన్ నగర నాయకులు ప్రకాష్, ఆనంద్ రావు, నాగరాజు, కేశవులు, అజుముద్దీన్, నాయక్, వెంకటేష్ , ఓబుల్ రెడ్డి, కార్మికులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలను చెల్లించాలి


కడప వైఎస్సార్ సర్కిల్: మెప్మా ఆర్పీ (రిసోర్స్ పర్సన్లు)లకు వేతనాలు సక్రమంగా అందక విలవిల్లాడుతున్నారని, తక్షణమే పెండింగ్‌లో ఉన్న వేతనాలు విడుదల చేయాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కేసి బాదుల్లా డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని హోచిమిన్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్పీలకు మూడు నెలలుగా జీతాలు అందలేదని, వారు పండుగలు ఎలా జరుపుకుంటారని ప్రశ్నించారు. క్రిస్మస్ పండుగ ముగిసి కొత్త సంవత్సరంతో పాటు సంక్రాంతి పండుగ కూడా దగ్గరలోనే ఉండడంతో చేతిలో చిల్లిగవ్వ లేక ఆర్పీలు అప్పుల కోసం పరుగులు తీయాల్సి వస్తోందన్నారు. కుటుంబ పోషణ కూడా వారికి కష్టంగా ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మెప్మా రిసోర్స్ పర్సన్‌లకు వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన బాట పడతామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ నగర కార్యదర్శి ఉద్దే మద్దిలేటి, జిల్లా కార్యదర్శి కె లింగన్న, నాయకులు ఈశ్వరయ్య పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్ నిర్వహణలో వాగ్వాదం

కడప అర్బన్: కడప నగర శివార్లలోని కేంద్ర కారాగారం బయట ఖైదీలతో నిర్వహించే పెట్రోల్ బంక్‌లో విధుల నిర్వహణపై అక్కడ పనిచేస్తున్న సిబ్బంది, ద్వితీయస్థాయి అధికారికి మధ్య గురువారం వాగ్వివాదం చోటుచేసుకుంది. ఇలాంటి వాగ్వివాదం ఈనెలలోనే చోటు చేసుకోవడం ఇది రెండవసారి . అక్కడే దీర్ఘకాలంగా పనిచేస్తున్న సిబ్బందికి, నూతనంగా వచ్చిన ఓ అధికారికి మధ్య వాగ్వివాదం కాస్త ఘర్షణకు కూడా దారి తీసినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువైందని ప్రజలు భావిస్తున్నారు. ఈ వాగ్వివాదం, ఘర్షణలు ఏ స్థాయికి దారితీస్తాయోనని అందరూ అనుకుంటున్నారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకొని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా క్రమశిక్షణా చర్యలను తీసుకుంటే మంచిదని కొందరు అధికారులు, సిబ్బంది అభిప్రాయపడుతున్నారు.



నీటితో కళకళలాడుతున్న బుగ్గవంక ప్రాజెక్టు



ప్రాజెక్టులో ఉన్న ప్రస్తుత నీటిమట్టం

బుగ్గవంకకు జలకళ

కడప వైఎస్సార్ సర్కిల్: కడప నగర శివార్లలోని బుగ్గవంక ప్రాజెక్టుకు పెద్దగాడి, చిన్నగాడి నుంచి వరద నీరు వచ్చి చేరుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు ప్రాజెక్టులోకి నీరు చేరిన నేపథ్యంలో అధికారులు ముందస్తుగా ఆ నీటిని కుడి, ఎడమ కాల్వలకు విడుదల చేశారు. ప్రాజెక్టులో 183 అడుగుల నీటి మట్టంగా ఉండగా చెరువులకు నీటిని విడుదల చేయడంతో ప్రాజెక్టులో నీటిమట్టం తగ్గుముఖం పట్టింది. అయితే ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులోని 20 క్యూసెక్కుల నీరు వస్తుండటంతో 10 క్యూసెక్కుల నీటిని కుడి, ఎడమ కాల్వలకు వదిలారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 181.5 అడుగుల నీటిమట్టం ఉండగా 184.5 అడుగులు నీరు చేరితే ప్రాజెక్టు గేట్లు తెరుస్తామని అధికారులు పేర్కొన్నారు.

ఖోఖో పోటీల్లో ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్

కడప స్పోర్ట్స్: యోగివేమన విశ్వవిద్యాలయంలో ఇటీవల నిర్వహించిన అంతర్ కళాశాలల ఖోఖో పోటీల్లో ఆర్ట్స్ కళాశాల జట్టు రెండోస్థానంలో నిలవడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ డా.జి. రవీంద్రనాథ్ అభినందించారు. కళాశాల జట్టు పోటీల్లో చక్కటి ప్రతిభ కనబరచడంతో పాటు జట్టు క్రీడాకారుడు సాయి చెన్నైలో నిర్వహించే అంతర్ విశ్వవిద్యాలయాల ఖోఖో పోటీల్లో పాల్గొనే వైవీయూ జట్టుకు ఎంపికయ్యాడు. కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ టి. హజరతయ్య, కె. మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్షలు

కడప అర్బన్: ఎన్.డి.పి.ఎస్ (నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్) కోర్టు కడపలో ఉన్నదాన్ని అలాగే కొనసాగించాలని, కడప నుంచి తిరుపతికి తరలిస్తూ ప్రభుత్వం జారీ చేసిన 145 జీఓను రద్దు చేయాలంటూ కడప న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో 18 రోజులుగా కడపలోని జిల్లా కోర్టు ఎదురుగా రిలే నిరాహార దీక్షలను చేస్తున్నారు. గురువారం నిరసన దీక్షా శిబిరానికి వచ్చిన రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్. తులసిరెడ్డి తమ సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చెప్పలి పుల్లయ్య, ప్రసాద్‌గౌడ్, అమర్‌నాథ్‌రెడ్డి, ఉత్తన్న, వినయ్ పాల్గొన్నారు.

29న జిల్లాస్థాయి కబడ్డీ ఎంపికలు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని గాంధీనగర్ నగర పాలకోన్నత పాఠశాలలో ఈనెల 29వ తేదీన జిల్లా స్థాయి కబడ్డీ జూనియర్ విభాగం ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్. గోవర్ధన్‌రెడ్డి, కార్యదర్శి టి. జనార్దన్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు జనవరి 3 నుంచి 6వ తేదీ వరకు కర్నూలులో నిర్వహించే 28వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు 2005 డిసెంబర్ 1 తర్వాత పుట్టినవారై ఉండాలన్నారు. బాలుర విభాగంలో 70 కేజీలు, బాలికల విభాగంలో 65 కేజీలు బరువు ఉండాలన్నారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్‌కార్డు, పదోతరగతి ఒరిజినల్ మార్కులిస్టు వెంట తీసుకురావాలని సూచించారు.

ఆర్థికశాఖ అధికారులతో బ్యాంకు సమస్యను చర్చిస్తా

– ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి



ఎమ్మెల్సీకి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న వివిధ సంస్థల ప్రతినిధులు

కడప కల్చరల్ : గ్రామీణ బ్యాంకులు రాష్ట్రస్థాయిలో విలీనమైన తర్వాత ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయం కడప నగరంలోనే కొనసాగేలా రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక శాఖ అధికారులను కలిసి చర్చిస్తానని రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి తెలిపారు. గురువారం సేవ్ పబ్లిక్ సెక్టార్ కమిటీ కన్వీనర్ రఘునాథరెడ్డి, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవి శంకర్ రెడ్డి, ఏపీజీబీ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జగదీష్‌లతో కూడిన బృందం ఎమ్మెల్సీని కలిసి ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని తరలించడంపట్ల తమ అభ్యంతరాలు, నిరసనను వ్యక్తం చేసి, ఈ మేరకు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం దృష్టికి ఈ అంశాలను తీసుకుపోతానని అన్నారు.

ఘన నివాళి

కడప కార్పొరేషన్: కడప నగరం మారుతీనగర్‌లో మైదుకూరు మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి బంధువు ముండ్ల సుధాకర్‌రెడ్డి పెద్ద కర్మలో రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి చిత్రపటం వద్ద పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, ఆయన తనయుడు నాగిరెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రం అప్పులపాలు

కడప వైఎస్సార్ సర్కిల్: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులపాలు చేస్తున్నదని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి ఎస్. తులసిరెడ్డి పేర్కొన్నారు. గురువారం నగరంలోని ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వం బాదుడు ప్రభుత్వంగా, వీర బాదుడు ప్రభుత్వంగా తయారు కావడం శోచనీయం అన్నారు. ఈ 6 నెలల కాలంలో అనేక విధాలుగా ప్రజలపై భారం మోపిందన్నారు. సర్దుబాటు చార్జీల పేరుతో విద్యుత్ వినియోగదారుల పై రూ.15,485 కోట్ల అదనపు భారం మోపిందన్నారు. ఈ కార్యక్రమంలో కడప అసెంబ్లీ కోఆర్డినేటర్ బండి జకరయ్య, పీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సత్తార్, డీసీసీ మాజీ ఉపాధ్యక్షులు కదిరి ప్రసాద్ గౌడ్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు మామిళ్ళ బాబు, మాజీ నగర మహిళా అధ్యక్షురాలు నాగరత్న గౌడ్ పాల్గొన్నారు.